ఆవిడ

'భాగ్యనిలయం'లో అడుగుపెట్టిన రోష్నికి గులాబీలు, అగర్‌బత్తీల వాసన పూసుకున్న మృత్యువు గుప్పుమంటూ గుమ్మంలోనే ఎదురైంది. ప్రశాంతంగా, నిశ్చింతగా వచ్చిన పని అయిపోయినట్లు మంచుపెట్టెలో పడుకున్న తండ్రి రూపంలో. "అయిపోయింది. ఈ ఇంటితో నీకు ఋణం తీరిపోయింది" అంటూ పొడికళ్ళు తుడుచుకుంటూ కౌగలించుకోబోయింది ఒకావిడ. వదిన తల్లిలా వుంది. ఆవిడ కౌగిలికి చిక్కకుండా లోపలికి వచ్చింది రోష్ని.

బంధుమిత్రులు పదిమందీ హాజరుగా వున్నారు. హాజరుగా వున్న వాళ్లంతా ప్లాస్టిక్ కుర్చీల్లో కూచుని వచ్చిన పని కాస్తా అయిపోతే వెళ్ళిపోడానికి సిద్ధంగా వున్నారు. వాళ్లు కూర్చున్న కుర్చీల కింద నలిపి పడేసిన ఎంగిలి కాఫీ కప్పుల మీద ఈగలు ముసురుతున్నాయి. కొంతమంది మగవాళ్ళు బయట నిలబడి సిగరెట్లు కాలుస్తున్నారు. కొందరు ఆడవాళ్ళు ఒక మూలన చేరి లోగొంతులో మాట్లాడుతున్నారు. తనే ఆలస్యం అయింది. చూడబోతే అందరికీ తత్వం వంటబట్టినట్లే వుంది. మరణం తప్పదు. అంత్యక్రియలూ తప్పవు. మన కాఫీ తలనెప్పులూ తప్పవు. పదిమందీ చేరినప్పుడు రకరకాల కబుర్లూ తప్పవు. అర్ధరాత్రి హఠాత్తుగా కబురందితే అంతదూరంనించీ రావాలి కనుక ఇంతసేపైంది... తను కనపడగానే వాళ్ల మొహాలు తెరిపిన పడ్డాయి. మొన్న వేసవిలో వచ్చినప్పుడు ఎగిరెగిరి తనతో బాడ్మింటన్ ఆడిన మనిషి... అచ్చంగా నిన్నకాక మొన్న ఫోన్లో తన పదేళ్ల కూతురుతో పావుగంట గలగలలాడిన మనిషి... మూణ్ణాళ్ల ముచ్చట కోసం ఇందరి అవహేళనకు గురైన మనిషి...

అన్నయ్యా, వదినా ఈ ఇంట్లో కాలుపెట్టి మూడేళ్లయింది. ఇప్పుడు ఇల్లంతా వదిన తాలూకు మనుషులే కనిపిస్తున్నారు. కొన్నాళ్లుగా ఈ ఇంట్లో దొరకని ప్రవేశం ఇప్పుడు

దొరికినట్లయింది వాళ్లకి. బయట మావయ్య హడావుడి చేస్తున్నాడు. ఆయన కూడా మూడేళ్ళ తరువాత ఇప్పుడే వచ్చినట్లున్నాడు. వాళ్లంతా ఇప్పుడొచ్చి ఈ వ్యవహారాన్ని భుజాన వేసుకున్నట్టున్నారు. 'ఆవిడ' ఎక్కడా కనబడలేదు.

వరండాలో మాటలు ఎక్కువయ్యాయి. "ఎంతమంచివాడో! ఎంత హుషారో!! ఎంత స్నేహ స్వభావమో!! అప్పుడు నాకది చేశాడు. ఇప్పుడు నాకిది చేశాడు... పొద్దున లేస్తూనే మల్లెపువ్వుల్లాంటి బట్టల్తో వాకింగ్‌కి వచ్చేవాడు..."

కానీండి కానీండి... రాసిచ్చిన సామగ్రి అంతా వచ్చిందా? ఆవు నెయ్యొచ్చిందా? మంచిగంధం చెక్క ఒకటి తెచ్చారా? కానీండి పొద్దెక్కుతోంది అని ఆయన్ని సాగనంపడానికి ఆత్రపడుతున్నారు. పలకరించి సానుభూతి సంతాపాలు ప్రకటించాలని ప్రయత్నిస్తున్న వాళ్ళని తప్పుకు తిరుగుతోంది రోష్నీ. అంతా కృత్రిమంగా, వెగటుగా, మొక్కుబడిగా... ఇంతకీ 'ఆవిడే'దీ? ఎక్కుడుంది? కనపడలేదేం?

"ఎంత ఆశపడిందో పాపం... అంతా గాలిబుడగలా పేలిపోయింది. ఏంచేస్తాం కొందరి జాతకాలంతే..." నాన్న స్నేహితుడు సారథి వ్యాఖ్యానిస్తున్నాడు. ఆయనకెందుకో 'ఆవిడ' అంటే చిరాకు... ఎవరికి లేదు చిరాకు? తనకి లేదా? అన్నయ్యకి లేదా? వదినకి లేదా? మామయ్యకి లేదా? అత్తయ్యొచ్చి రోష్నీ భుజం మీద చెయ్యేసి "భాగ్యమ్మ పోవడమే ఈ ఇంటికి శని పట్టింది" అంది. భాగ్యమ్మ రోష్నీ తల్లి. బ్రతికి ఉన్నప్పుడు అత్తయ్యకి ఆమెంటే గిట్టేదే కాదు. అంతా సిద్ధమైంది. పూలదండలు కట్టిన వాహనం ఒకటి వాకిట్లోకి వచ్చింది. అందర్నీ ఆయన కాళ్ళకు మొక్కమన్నారు. "ఆవిడ్ని పిలవండి. వచ్చి దండం పెట్టుకోమనండి" అని కాస్త కటువైన స్వరంతో కేకపెట్టాడు మావయ్య. భాగ్యం అన్నయ్య.

పొద్దుటినించీ 'ఆవిడ' బయటికి రాలేదట. అలాగే గదిలో చాపమీద ముడుచుకు కూచుందట.

"మొహం చూడు" అని గొణుక్కుంది వదిన. పార్వతి వెళ్ళి 'ఆవిడ'ని చెయ్యి పట్టుకు తీసుకొచ్చింది. దగ్గరుండి దండం పెట్టించింది. వాహనం కదిలిపోయింది. 'ఆవిడ' పమిట కొంగు నోట్లో కుక్కుకుంటూ గబగబ లోపలికి పోయింది. దుఃఖం గూడు కట్టి కమిలిపోయిన ముఖం.

"రేత్రేళనించి అమ్మ పచ్చి గంగ ముట్టలేదు. అంతా ఆరగా, ఆరగా కాఫీలు తాగుతూనే వుండారు. ఏం మనుసులో ఏంటో... పోనీ నేనిద్దామంటే నన్ను ఆ సాయలకు రానీల్లేదు... రోషనమ్మా ఆ తల్లికి గొంతు కాత్త తడుపమ్మా" అంది దగ్గరకొచ్చి పార్వతి. భాగ్యమ్మ నాటినించి ఆ ఇంటి పనిమనిషి.

"అమ్మాయ్ రోష్నీ నీ దగ్గర డబ్బేమైనా వుందా? మీ అన్నయ్య ఫోన్ రాగానే ఆదరాబాదరా పరిగెత్తుకొచ్చాట్ట. ఇప్పుడెంతలేదన్నా పదివేలన్నా కావాలి ఈ పూటకి" అంటూ

వచ్చాడు అన్నయ్య మామగారు. రోష్నీ బిత్తరపోయింది. నాన్న పోయాడంటే పరిగెత్తుకు రావటమేకానీ డబ్బు సంగతే ఆలోచన లేదు. పర్సులో ఏం వుందో చూసుకోకుండానే కారెక్కేసింది. ఆమెకి తెరలు తెరలుగా దుఃఖం వచ్చింది. ఎవరు ఎవర్ని ఓదారుస్తారు? ఎవరి దుఃఖ భారాన్ని వాళ్ళే మొయ్యాలి. అంతవరకు గోడకానుకుని చాపమీద కూచున్న 'ఆవిడ' చివ్వున తలెత్తింది! ఊడిపోయిన జుట్టుకి రబ్బర్‌బ్యాండ్ వేసుకుంటూ లేచి బీరువా లోనించీ కొంత డబ్బు తీసి రోష్ని చేతిలో పెట్టి 'అన్నయ్యకివ్వు' అంది.

"పిడుగులాంటి మనిషి... నిన్న సాయంత్రం కూడా సూపర్ మార్కెట్‌కొచ్చి ఏవో కొనుక్కుపోయాట్ట. ఇంతలోకే ఎట్లా మూసుకొచ్చిందో!" అన్నాడన్నయ్య మామగారు. 'ఆవిడ'వైపు ఒక వికారమైన చూపు సారించి.

"మాసివ్ హార్ట్ అటాక్‌లు అట్లాగే వస్తాయి" అన్నాడు అక్కడున్న ఆయన కొడుకు.

"పిల్లల్ని అన్యాయం చేసిపోయాడు. పిల్లలూ, భాగ్యమూ ఈ ఇల్లు చూసుకు మురిసిపోయేవాళ్ళు. మాయమాటలు చెప్పి రాయించుకునే వుంటుంది. ఎవరి సొమ్ము ఎవరు తినబుట్టారో ఎవరికెరుక... నేను అన్నయ్యతో చెబుతూనే వున్నాను ఇల్లు రాయించేసుకోరా అని! వాడు తండ్రిమీద అలిగి కూచున్నాడు. ఇతగాడేమో ఇట్లా అర్థాంతరంగా మాయమైపోయాడు" అన్నాడు మామయ్య, అమ్మ అన్నయ్య... నెమ్మదిగా రోష్నితో.

హఠాత్తుగా పోయిన ఆ పెద్ద మనిషి విల్లు వ్రాశాడా, లేదా అనేది పెద్ద చర్చ అయిపోయింది బంధుమిత్రులకి. కొంత వినపడేలాగా కొంత వినపడకుండా, కొంత గుసగుసగా... ఆవిడ మాత్రం ఉలుకూ, పలుకూ లేకుండా కూచుంది. ఇల్లు రాయించుకునే వుంటుంది అందుకే నిమ్మకు నీరెత్తినట్లు కూచుందని తేల్చిన వాళ్ళూ వున్నారు.

బంధుగణం ఎవరికి తోచిన సలహాలు వాళ్ళిచ్చి ఎవరికి తట్టిన వ్యాఖ్యలు వాళ్ళు చేసి నిష్క్రమించాక, అన్నయ్య కూడా వెళ్ళడానికి సిద్ధమౌతూ, 'ఆవిడ' దగ్గరకు వచ్చి "ఈ చెక్కు వుంచండి" అని ఆవిడిచ్చిన డబ్బుకి చెక్కు చేతిలో పెట్టి సెలవు తీసుకున్నాడు.

"నువ్వు నాలుగు రోజులుండు" అంది 'ఆవిడ' ప్రయాణమౌతున్న రోష్ని చెయ్యి పట్టుకుని.

దీపక్‌తో పిల్లల్ని పంపించేసింది రోష్ని.

"నువ్వు బయలుదేరవా?" అని కోపంగా చూసి వెళ్ళిపోయాడు అన్నయ్య.

మొన్న వేసవికాలం అందర్నీ రమ్మని నాన్న పిలిచినప్పుడు అన్నయ్య రాలేదు. తనని కూడా వద్దన్నాడు. తనొచ్చిందని కోపమొచ్చి సరిగ్గా మాట్లాడడం మానేశాడు. రాకపోతే ఆ పదిరోజులూ నాన్నతో వుండే అదృష్టం కూడా దక్కేది కాదు. తనకీ, నాన్నకీ మధ్య 'ఆవిడ' అడ్డుగోడలా నిలబడిందన్న భావం అంతగా కరిగిపోకుండానే జరిగిపోయింది ఆ

పదిరోజులూ. ఇప్పుడు అమ్మా, నాన్నా ఇద్దరూ లేని ఈ ఇల్లు పరాయిదైపోయింది. తనను పలకరించిన ప్రతి మనిషీ ఏదో ఒకవిధంగా ఇంటి ప్రసక్తి తెస్తూనే వున్నారు. నాన్న పోవడంకన్న ఇల్లు పోవడం వాళ్ళనెక్కువ బాధిస్తున్నట్లు.

తెల్లవారుతూనే 'ఆవిడ' లేచి కాసేపు మొక్కల్లో తిరిగింది. మొక్కలన్నీ నవనవలాడుతున్నాయి. ఆపైన కాఫీ పెట్టి ఇచ్చింది. ఆవిడ వంట చేస్తుంటే తను ఇల్లంతా తిరిగింది. నాన్న లైబ్రరీ... నాన్న టేపులు, సీడీలు ఆయన కంప్యూటర్, ఆయన బీరువా అన్నీ తీసి చూసింది. పుస్తకాలు వాసన చూసింది. వాటి మధ్య అమ్మ వేపసబ్బు పొడికొట్టి చిన్న మూటకట్టి పెట్టేది. బీరువా తియ్యగానే ఎవరో స్నానం చేసి తువ్వాలు చుట్టుకుని వస్తున్నట్లుండేది. ఇస్త్రీ పెట్టిన ఆయన తెల్లని వాకింగ్ డ్రెస్‌ల మధ్య కలరా వుండలు, ఆయన వాడే మూడు నాలుగు రకాల షూజ్ వరసగా మెరుస్తూ... అన్నీ అప్పటిలాగే వున్నాయి. తేడా ఒకటే! భాగ్యం డిలీట్ అయిపోయి ఈవిడ సేవ్ అయింది. ఇప్పుడాయన కూడా డిలీట్ అయిపోయాడు. హాల్లో గోడమీద వున్న ఫోటోలో తను స్కర్ట్ వేసుకునీ, అన్నయ్య నిక్కర్లోనూ, నాన్న గళ్ళలుంగీలోనూ, అప్పుడే పేరంటానికి వెళ్ళొచ్చి పట్టుచీరెలో వున్న అమ్మ, సిమెంట్ గమేళాలు నెత్తిన పెట్టుకుని!! "భాగ్య నిలయ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలలాగా ఫోజు" అనేవాడు అన్నయ్య. ఇంక ఈ ఇల్లు వుండదు. తనిక్కడికి రాలేదు. రెండు రోజులు మౌనంగానే గడిచిపోయాయి. మూడోరోజు ధైర్యం కూడగట్టుకుని అడిగింది "అసలు మా నాన్నగారు మీకెట్లా తెలుసు? మీకన్న ఇరవై ఏళ్ళు పెద్దైన ఆయన్ని ఎందుకు పెళ్ళి చేసుకున్నారు? అఫ్‌కోర్స్ ఆయన ఇంత త్వరగా పోతారనుకుని వుండరు... మేమూ అనుకోలేదు, చాలా దృఢమైన మనిషి".

'ఆవిడ' రోష్ని కళ్ళల్లో దేనికోసమో వెతుకుతున్నట్లు రెండు క్షణాలు చూసి "చెప్తున్నాను" అంది.

అమ్మా, నాన్నా బస్సు యాక్సిడెంట్‌లో చనిపోయినప్పుడు శేషు మామయ్య ఇంట్లో వుండి బ్రతికిపోయి... వాళ్ల అంత్యక్రియలకి వెళ్ళి మళ్ళీ దిక్కులేని దానిగా మామయ్య ఇంటికే వచ్చింది. వచ్చాక చాలాసార్లు తను వాళ్లతోపాటు చచ్చిపోతే ఎంత బావుండేదో అనుకుంది. ఉద్యోగం తప్ప మరో ఆధారంలేని వాళ్ళ నాన్న, పాతికేళ్ళొచ్చిన శేషుకి పెళ్ళి చెయ్యలేకపోయాడు. పదోక్లాసు పైకి చదివించలేకపోయాడు. చిన్నదో, చితకదో ఏదైనా ఒక పని చేసుకోనివ్వలేకపోయాడు. ఇంటికైతే తీసుకొచ్చాడు కానీ మామయ్య కూడా పైవేవీ చెయ్యలేకపోయాడు. బుద్ధిమంతురాలయినా, చూడ్డానికి బాగా వున్నా శేషుని చేసుకోడానికి మామయ్య కొడుకు ఒప్పుకోలేదు. అత్తయ్యా ఒప్పుకోలేదు. మామయ్య కొడుక్కి అతని సహోద్యోగితో పెళ్ళైనాక అత్తయ్య శేషుకు ఇల్లు అప్పజెప్పేసింది. అమ్మనీ నాన్ననీ వాళ్ళతో గడిపిన పాతికేళ్ళ జీవితాన్ని తలుచుకోడానికి కాని, తనెందుకు పోలేదని విచారించడానికి

గాని సమయం దొరక్కుండా రెండు దశాబ్దాలు వంటల్లో, అంట్లగిన్నెల్లో బజారు పన్లల్లో హడావుడిగా గడిచిపోతున్నప్పుడు మామయ్యకి గుండె నెప్పొచ్చింది. ఆ గుండెలో స్టెంట్లు పడ్డప్పుడు, మామయ్యతో శేషు హాస్పిటల్‌లో ఉన్నప్పుడు, కాలనీలో వుండే మామయ్య స్నేహితుడు రామారావుగారు చూడ్డానికొచ్చారు.

"నేను పోతే దీన్ని మావాళ్ళు ఈమాత్రం కూడా చూడరు. తిన్నావా, లేదా అని కూడా అడగరు. తీసుకొచ్చి దాని ఉసురు పోసుకుంటున్నాను" అని కంట తడిపెట్టాడు మామయ్య. రామారావుగారు వరసగా మూడు రోజులూ వచ్చారు. నాలుగో రోజు ఇంటికొచ్చారు. "మీ మేనకోడల్ని నేను పెళ్ళి చేసుకుంటాను. పదిరోజులపాటు ఆలోచించి చెప్పండి" అన్నారు.

శేషు బిత్తరపోయింది. కానీ మామయ్య ఆలోచించాడు. "పెళ్లి ఒక జీవన భృతా మామయ్యా?" అని అడిగిన శేషుని అవునని చెప్పి ఒప్పించాడు. "ఇక్కడ ఇరవై ఏళ్ళున్నావు... ఏముంది నీకు? ఆయన నీ జీవితానికొక ఆసరా కల్పిస్తాడు. మంచి స్వభావం కలవాడు. భాగ్యమ్మగారిని బాగా చూసుకునేవాడు. నా మాట విను" అని నెత్తీ నోరూ బాదుకున్నాడు.

"ఆవిడ ఒకింటినించీ మరో ఇంటికి వంటమనిషిగా వచ్చిందంటారా?" అంది రోష్ని కొంచెం వ్యంగ్యంగా.

వచ్చినప్పుడు అట్లాగే అనుకుంది. తనకో శరీరం వుందని అది కొంత సుఖాన్ని కోరుతుందని ఎప్పుడో మర్చిపోయిన శేషు, మామయ్య ఇంటికన్న భిన్నమైనదేదీ ఆశించే అవకాశం లేని పెళ్ళి అది. పెళ్లినించీ ఇంకే సుఖాన్నీ ఆశించే వయసూ దాటిపోయింది. పెళ్లి ఒక ఆసరా... కానీ ఆయన వంట కోసమే ఆమెని తెచ్చుకోలేదు. ఆమెని పట్టించుకున్నాడు. బ్రతకనిచ్చాడు. కాసేపు విశ్రాంతిగా కూచుని సంగీతం విననిచ్చాడు. పుస్తకాలు చదవనిచ్చాడు. తనకిష్టమైన పని చేసుకోనిచ్చాడు. "ఇంకా వంట కాలేదా? పిల్లలకి క్యారేజీలు కట్టవా? నా చీరె కాస్త ఇస్త్రీ చేసిపెట్టు... రోజూ ఈ టిఫినేనా? రాత్రికి పెసరట్లకి పప్పు నానెయ్, దాంతో అల్లం పచ్చడి చెయ్యి" లాంటి మాటలు మాత్రమే వినడానికి అలవాటుపడ్డ శేషు కలుగులాంటి ప్రపంచాన్ని విస్తృతం చేశాడు. ఆ ప్రపంచాన్ని చూసే కొత్త చూపునిచ్చాడు. శేషుకి ఆయన ప్రతి మాటలో, చేతలో తన తండ్రే కనపడేవాడు. ఆయన అవసరాలు చూడ్డం శేషుకి ఇష్టంగానే వుండేది. ఈ మూడేళ్ళూ ఆయనా, శేషూ ఎంతో స్నేహంగా వున్నారు. ఆయన ఆమెకొక జీవితం ఇచ్చాడు."

"ఆస్తీ అంతస్తు కూడా ఇచ్చాడు" అంది రోష్ని, మొహం గంటు పెట్టుకుని.

'ఆవిడ' రోష్ని కళ్ళల్లోకి చురుగ్గా చూసి "ఈ ఇల్లు సంగతేగా నువ్వు కూడా మాట్లాడుతున్నావు? అందరూ అనుకోడం వింటూనే వున్నాను. ఇది నాకివ్వలేదు. నాకివ్వనని

చెప్పి పెళ్లి చేసుకున్నారు. పెళ్ళికి ముందురోజే మీ ఇద్దరి పేరా వీలునామా రాశారు. ఎవరికీ చెప్పొద్దన్నారు. నాకు కాస్త ఊపిరి తీసుకునే ఏర్పాటు చేశారు. ముందుచూపు జాస్తి... అందరూ వుండగా చెప్పడం ఇష్టంలేకనే నిన్ను ఉండమన్నాను..." అంటే రోష్ని తెల్లపోయింది.

"నువ్వు పొమ్మంటే ఈ రోజే పోవాలి నేనిక్కడనుంచి" అని నవ్వింది 'ఆవిడ'. ఇందాకటి దుఃఖపు జీరలేదు.

"ఇప్పుడు నువ్వు కాస్త స్థిమితంగా వుండొచ్చు" అంది మళ్ళీ.

దుఃఖంతో అక్కడినించీ లేచిపోయింది రోష్ని. ఆమెకి అర్థంకానిది ఒకటే, అమ్మపోయాక మూడేళ్ళు ఒంటరిగా గడిపిన మనిషి ఈవిడని ఉద్ధరించడానికే పెళ్ళి చేసుకున్నాడా?

"శేషుని ఉద్ధరించడానికి ఆమెను ఆయన పెళ్ళి చేసుకోలేదు. తనని తను ఉద్ధరించుకోడానికే చేసుకున్నాడు" అందావిడ వచ్చి పక్కన కూచుని.

అమ్మాయింట్లోనూ ఊపిరాడలేదు. అబ్బాయింట్లోనూ ఊపిరాడలేదు. పోనీ అని దేశం చుట్టి వచ్చేసరికి ఇల్లు బూజులు పట్టిపోయి బావురుమంటోంది. ఎక్కడికక్కడ రిపేర్లొచ్చాయి. మొక్కలన్నీ చచ్చిపోయాయి. భాగ్యం, పిల్లలతోపాటు ఈ ఇల్లు కూడా తన జీవితంలో ఒక భాగం... భాగ్యాన్ని తిరిగి తెచ్చుకోలేదు, పిల్లల బ్రతుకులు పిల్లలవి. ఇల్లు వదలలేదు. ఈ వూరు, ఈ కాలనీ, ఈ ఇల్లు ఇక్కడ తను అలవాటుపడ్డ జీవితం వదలలేదు. ఒంటరిగా ఉండలేదు... మానవ స్పర్శ కావాలి. అప్పుడే శేషుని చూశాడు. ఆమెని తనతో తెచ్చుకోడానికి, ఆమె మీద వాళ్లకు హక్కు లేకుండా చెయ్యడానికి పెళ్లి ఒకటే మార్గమనిపించింది. శేషుకీ మామయ్య చెప్పిన దాంట్లో సత్యం తెలుసు. కఠిన కారాగార శిక్షలాంటి జీవితం మామయ్యింట్లో. అంతకుమించిన కష్టాలు ఎక్కడా వుండవు. ఎన్నోసార్లు అక్కడినించీ పారిపోవాలనుకుంది. కానీ వీధినపడ్డ ఆడదాని జీవితాన్ని తలుచుకుని భయపడి, ఒక ఆచ్ఛాదన కోసం నాలుగు గోడల మధ్య భద్రత కోసం ఉండిపోయింది. రామారావుగారితో జీవితం ఒక సింబియాసిస్".

మరి ఎవరికీ మాటలు పెగలలేదు. దీపక్ ఫోన్ చేశాడు. పిల్లలు గొడవ పెడుతున్నారు రేపొస్తున్నాం మాతో వచ్చెయ్ అని. ఆవిడకి చెప్పింది ఆ మాట.

"లాయర్ దగ్గర వీలునామా వుంది తీసుకో... నీ ఇష్టం... నన్ను కొంతకాలమైనా ఈ ఇంట్లో ఉండనిస్తే వుంటాను. లేదంటే నువ్వు ఎప్పుడు ఖాళీ చెయ్యమంటే అప్పుడే చేస్తాను" అందావిడ.

"తొందరపడకండి" అని మాత్రమే అనగలిగింది.

"నాన్నని చాలా ప్రేమించానని, గౌరవించానని అనుకున్నాను. అంతా ఒట్టిదే" కారులో కూచున్న రోష్నీ కన్నీటి వరదలో తడిసిపోయింది.

ఆ వయసులో పెళ్లి చేసుకున్నాడని అందరితోపాటే విమర్శించి, ఆయన ఫోన్ చేసినప్పుడల్లా వ్యంగ్యంగా మాట్లాడి, ఆయన మీద కోపాన్ని ఆవిడ మీద అసహ్యంగా మార్చుకుని... మొన్న వేసవిలో వచ్చి పదిరోజులుండిపోయాక కూడా ఆ కోపం పోగొట్టుకోలేక పోయి, ఆయన అమ్మని పూర్తిగా మర్చిపోయాడనుకుని ఖరారు చేసుకుని...పిల్లల చిన్నప్పుడు భార్య చనిపోతే వాళ్లని పెంచడం కోసం మళ్ళీ పెళ్ళి చేసుకోడం సబబే, కానీ వయసు అయిపోయి మనవరాళ్ళు పుట్టాక పెళ్ళేమిటో అని ఏవగించుకుని, వదినలాగా, అత్తయ్యలాగా మామయ్యలాగా, లోకుల్లాగా... ఆయన్ని మాటలతో గుచ్చి ఇప్పుడు ఇల్లు ఇచ్చాక పశ్చాత్తాప పడుతోందా? తక్కిన వారికన్న ఉన్నతంగా ఆలోచిస్తున్నామని ఎవరికి వాళ్ళు అనుకుంటారు కానీ అందరూ సామాన్యులే... 'నాన్న ఇల్లు ఆవిడకి రాసివ్వలేదన్నాక తనకి ఆవిడ మీద ఏ కాస్తో సానుభూతి కలగడమూ అలాంటిదేనేమో! ఎప్పుడో ఎవరో సృష్టించిన పాత విలువల్ని ఇంకా అందరిమీదా రుద్దుతూ... మనుషులు మారుతున్నారనీ, కాలానుగుణంగా, ప్రాక్టికల్‌గా బ్రతకడం నేర్చుకుంటున్నారనీ అర్థం చేసుకోలేక పోతున్నామా? మొదటినించీ ఆయనకి ఇంట్లో అంతా తన మాటగా వుండేది. ఆయన చెప్పేది అంతా వినేవారు. ఆయన అభిరుచుల్ని గౌరవించేవారు. ఇప్పుడు కూడా ఆయనకాస్థాయి జీవితమే కావాలి. ఆయన ఇల్లు, అందులో ప్రథమ స్థానం, తన జీవనస్థాయి, తన జీవన శైలి ఆయనకి కావాలి. అందుకు ఆయన ఎంచుకున్న మార్గం అది... అని ఇల్లు ఆవిడకి రాయలేదని తెలిసేవారకూ ఎందుకు అర్థంకాలేదు నాకు?' అనుకుంది రోష్నీ. ఆ మాటే పైకి అంది.

"నువ్వు ఇల్లు ఆశించడంలో అసహజమేమీ లేదు. అందులో సిగ్గుపడ్డానికి బాధపడ్డానికీ ఏమీలేదు. మనం ఎంత సెంటిమెంట్ రంగులు పూసుకున్నా ఆస్తుల ప్రభావం మన మీద అంత గట్టిగానూ వుంటుంది. నిజానికి ఆయనకి ఆస్తి వుండబట్టే ఎవరి మాటల్నీ లక్ష్యపెట్టక పెళ్ళి చేసుకోగలిగాడు. ఆస్తి అంటూ లేకపోతే జీవనస్థాయిలూ, ప్రత్యేక జీవన శైలులూ అంటూ ఏమీ వుండవు. అవన్నీ ఈ దేశంలో ఎంతమందికున్నయ్? ఎక్కడికక్కడ సర్దుకుపోవడమే! ఈ ఇల్లు వ్రాసిచ్చినట్లు ముందే తెలిసుంటే మీ అన్నయ్యా, నువ్వూ ఆయనకి వృద్ధాప్యంలో మీకు బదులు సేవచెయ్యడానికి ఒక మనిషి దొరికిందని సంతోషించేవాళ్ళేమో! ఆవిడని మీరంతా ఇంత చీదరించుకునే వాళ్ళు కాదేమో! అదింక వదిలెయ్... ఇప్పుడేం చేస్తావో ఏ విలువలతో ప్రవర్తిస్తావో ఆలోచించుకో" అంటున్నాడు దీపక్.

కళ్ళు తుడుచుకుని వెనక్కి వెళ్ళిపోతున్న పొలాలనూ పైన కదులుతున్న తెల్లటి దూది మబ్బుల్ని చూస్తూ కార్లో వెనక్కి జారపడింది రోష్నీ. ✻

(పాలపిట్ట – అక్టోబర్ 2010)